మైసమ్మతల్లి సన్నిధిలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డి

మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

కడ్తాల్, జూన్ 16 : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మైసిగండి మైసమ్మతల్లిని ఆదివారం రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అదనపు డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం ఆలయంలోని అమ్మ వారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట కడ్తాల్ గిరిజన వసతి గృహ వార్డెన్ రాములు, మైసిగండి ఆశ్రమ పాఠశాల వార్డెన్ బాలరాజు ఉన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కులకచర్ల, జూన్ 16 : ఆనందం, ఉద్వేగం, ఆప్యాయ పలకరింపులు, చిన్ననాటి ముచ్చట్లు, ఫోన్లలో సెల్ఫీలు అక్కడంతా ఉద్విగ్న వాతావరణం నెలకొంది. ఆదివారం మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామంలోని ఉన్నత పాఠశాలలో జరిగిన అపూర్వ సమ్మేళనం ఇందుకు వేదికైంది. ఆ పాఠశాలలో 1994-95 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఒక చోట చేరారు. 30 ఏండ్ల తర్వాత కలిసిన మిత్రులను ఆప్యాయంగా పలకరించి, యోగక్షేమాలు తెలుసుకున్నారు. నాడు పాఠశాలలో జరిగిన ఘటనలు, చేసిన అల్లరి, గురువుల బెత్తం దెబ్బలు అన్నీ గుర్తు చేసుకున్నారు. అప్పుడు పాఠ్యాంశాలు బోధించిన గురువులను సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

బక్రీద్ ప్రార్థనలకు సర్వం సిద్ధం

బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరులు నిర్వహించే ప్రార్థన(నమాజ్)ను పురస్కరించుకొని సైదాబాద్ ఉజాలా షా -ఈద్గా మైదానంలో జీహెచ్‌ఎంసీ, విద్యుత్, జలమండలి, శానిటేషన్, పోలీస్ విభాగాలకు చెందిన అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేశారు. టెంట్లు, చలువ పందిళ్లు, కూలర్లు, నీటి క్యాన్లను అందుబాటులో ఉంచారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా బారీకేడ్లు పెట్టారు. మలక్‌పేట ఎమ్మెల్యే బలాల, కార్పొరేటర్లు ఇక్కడే ప్రార్థనలు చేయనుండడంతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. సైదాబాద్ డివిజన్ ఏసీపీ వెంకన్న నాయక్ పర్యవేక్షణలో ప్రత్యేక బందోబస్తు చర్యలు చేపట్టారు.

- సైదాబాద్

అన్నదానం..మహాదానం

గాంధీ దవాఖాన వద్ద అన్నం వడ్డిస్తున్న పెద్ది శంకర్

ఆర్కేపురం, జూన్ 16 : అన్నార్తుల ఆకలి తీర్చడమే రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ముఖ్య లక్ష్యమని రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ చైర్మన్ పెద్ది శంకర్ అన్నారు. ఆదివారం సికింద్రాబాద్ గాంధీ దవాఖాన వద్ద రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. పెద్ది శంకర్ మాట్లాడుతూ.. రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ అనాథ ఆశ్రమంలో ప్రస్తుతం మతిస్థితిమతం కోల్పోయినవాళ్లు 50 మంది ఉన్నారని, ఎవరైనా పెండ్లి రోజు, పుట్టిన రోజుతో పాటు మరేదైనా శుభకార్యాలు జరుపుకోవాలంటే రెడీ టూ సర్వ్ ఫౌండేషన్‌లో జరుపుకోవచ్చని తెలిపారు.

కార్పొరేటర్ లచ్చిరెడ్డితో వీరాంజనేయ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం..

వనస్థలిపురం, జూన్ 16 : కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని బీఎన్ రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. వీరాంజనేయ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు ఆదివారం కార్పొరేటర్‌ను కలిసి, కాలనీలో నెలకొన్న సమస్యలను వివరించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రాధాన్యతా క్రమంలో సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సత్యనారాయణ, రామయ్య, సుధాకర్ రావు, రహీం, బాషా, శివశంకరయ్య, బాబు, రమేశ్, ఫణిందర్ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిగా ఇటీవల ప్రమాణం స్వీకారం చేసిన డాక్టర్ వీరేంద్ర కుమార్ ఖాతీక్‌ను ఆమనగల్లు మున్సిపాలిటీకి చెందిన ఆరెకటిక సంఘం రాష్ట్ర నాయకుడు మల్కేడి బన్సీలాల్ ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

-ఆమనగల్లు, జూన్ 16

ఆదమరిస్తే.. అంతే!

- జనవాసాల్లో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు
- ఇండ్లపై వేలాడుతున్న విద్యుత్ తీగలు
- వర్షాకాలంలో పొంచి ఉన్న ప్రమాదం
- భయాందోళనలో ప్రజలు

రోడ్డు పక్కనే కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్

మేడిపల్లి రైతువేదిక వద్ద కంపచెట్లలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

యాచారం, జూన్ 16 : అసలే వర్షాకాలం.. ఇండ్ల ముందు కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు, ఇనుప విద్యుత్ స్తంభాలు.. అప్పుడప్పుడు మెరుపులు, మంటలు.. ఇండ్లపై నుంచే వేలాడే విద్యుత్ తీగలు.. ఇలా.. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. దీంతో ప్రజలు భయంభయంతో కాలం వెళ్లదీస్తున్నారు. మండలంలో విద్యుత్ సమస్యలతో ప్రజలు నిత్యం సతమతమవుతున్నారు. ఇండ్లు, పాఠశాలల ముందు కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. మండల కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద పురాతన ఇనుప స్తంభం ప్రమాదకరంగా ఉంది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయకపోవడంతో గతంలో మూగజీవాలైన కోతులు, కుక్కలు, ఆవుదూడలు మృతి చెందిన ఘటనలున్నాయి. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట పెద్ద ఇనుప ట్రాన్స్‌ఫార్మర్ అత్యంత ప్రమాదకరంగా ఉంది. ఇక్కడ గతంలో స్వాతంత్ర్య దినోత్సవం రోజున జాతీయ పక్షి నెమలి విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. ఎలాంటి చర్యలు తీసుకోని పక్షంలో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి.

పలు గ్రామాల్లో పొంచి ఉన్న ప్రమాదం

మండల పరిధిలోని నానక్‌నగర్‌లో జనవాసాల మధ్య పాఠశాల సమీపంలో కంచెలేకుండా రెండు ట్రాన్స్ ఫార్మర్లు ఒకే చోట ప్రమాదకరంగా ఉన్నాయి. ఇనుప విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు పలుచోట్ల ప్రమాదకరంగా ఉన్నాయి. నజ్జికసింగారం, చౌదర్‌పల్లి, తులేఖుర్ధు గ్రామాల్లో ఇండ్ల ఎదుట ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తక్కళ్లపల్లి, కొత్తపల్లి, తులేఖుర్ధు, మేడిపల్లి, మాల్, మంథన్‌గౌరెల్లి, నందివనపర్తి, చౌదర్‌పల్లి, చింతపట్ల గ్రామాల్లో ఇండ్లపై, పొలాల్లో ప్రమాదకరంగా తీగలు వేలాడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

నాసిరకం పనులతో..

కాంట్రాక్టర్‌ల నిర్లక్ష్యంతో నాసిరకం పనులు చేపట్టడంతో గ్రామాల్లో అనేక స్తంభాలు ఒరిగిపోయాయి. మేడిపల్లి చెరువు సమీపంలో స్తంభాలు నాసిరకంగా వేయడంతో వరుసగా ఒకవైపు ఒరిగి ప్రమాదకరంగా మారాయి. అక్కడక్కడ కొన్ని కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. కొన్ని స్తంభాలకు తీగజాతి చెట్లు అల్లుకుపోగా, మరికొన్ని ట్రాన్స్‌ఫార్మర్లను కంపచెట్లు, ఇతర పొదలు మింగేశాయి. కొన్ని చోట్ల రోడ్ల పక్కన ఉన్న చెట్లకు విద్యుత్ తీగలు గాలికి తగలడంతో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ప్రజలు మండిపడుతున్నారు. ఇటీవల మండల పరిధిలో అనేక చోట్ల విద్యుత్ తీగలు చెట్ల కొమ్మలకు తగులుతున్నాయని వాటి కింద ఉన్న హరితహారం మొక్కలను పదుల సంఖ్యలో నరికివేశారు. పలు చోట్ల ప్రమాదం పొంచి ఉన్నా విద్యుత్ సిబ్బందిలో ఎలాంటి కదలికలు లేకపోవడం గమనార్హం.

పంట పొలంలో ప్రమాదకరంగా ఇనుప విద్యుత్ స్తంభం

వర్షం కురిస్తే..

మండలంలో గతంలో ఎంతో మంది రైతులు, ప్రజలు విద్యుత్ ప్రమాదాలకు గురై మృతి చెందారు. మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. మండలంలో ముసురుతో కూడిన వర్షం కురిస్తే అక్కడక్కడ ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రోడ్ల పక్కన, జనవాసాల్లో, ఇండ్ల ఎదుట ఉన్న ఇనుప విద్యుత్ స్తంభాలు, వాటిని అనుసరించి ఉన్న తీగలను తాకరాదని,ట్రాన్స్‌ఫార్మర్‌లకు దూరంగా ఉండాలని పలువురు సూచిస్తున్నారు. వర్షాకాలంలో అధికారులు, సిబ్బంది తమ నిర్లక్ష్యాన్ని వీడి మండలంలోని పలుగ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను గుర్తించి పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

వర్షాకాలంలో విద్యుత్ సమస్యలు రాకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలి. సమస్యలు పరిష్కరించి ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. జనవాసాల్లో ఉండే ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఏర్పాటు చేయాలి. వేలాడే తీగలను సరిచేయాలి. ఇనుప విద్యుత్ స్తంభాలను తొలగించాలి. ప్రజలు సైతం సమస్యలను గుర్తించి అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాలి. ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

- మహ్మద్ గౌస్, యాచారం

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

కందుకూరు, జూన్ 16 : రాష్ట్ర ప్రభుత్వం పేదలకు మెరుగైన వైద్యం అందించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కోరారు. కందుకూరుకు చెందిన కొమ్మగాల్ల జ్యోతి అనారోగ్యానికి గురై దవాఖానలో చేరారు. దవాఖాన ఖర్చులు లేకపోవడంతో ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డిని ఆశ్రయించడంతో విషయాన్ని సబితా ఇంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ముందస్తు చికిత్స కోసం ఆమె రూ. 1.20లక్షల మంజూరు చేసి ఎల్వోసీని బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సురుసాని రాజశేఖర్‌రెడ్డి, మండల బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు తాళ్ల కార్తీక్, మండల సోషల్ మీడియా కన్వీనర్ దీక్షిత్ రెడ్డి,బాలయ్య, బాధితులు పాల్గొన్నారు.

సీఎం ఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

వనస్థలిపురం : ఆపదలో ఆదుకునే సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్ నందనవనం కాలనీకి చెందిన రమణి మోకాళ్ల నొప్పులతో బాధపడుతోంది. ఎమ్మెల్యే సహకారంతో సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నది. ఆమెకు రూ. లక్ష ఎల్వోసీ మంజూరయ్యింది. ఆ చెక్కును ఆదివారం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆరోగ్యం విషయంలో జాగ్రత్త వహించాలన్నారు. సరైన వైద్యం చేయించుకోవాలని సూచించారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మధుసాగర్, రాకేశ్ ఠాకూర్ పాల్గొన్నారు.



కందుకూరు : ఎల్వోసీ అందజేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



సీఎంఆర్ఎఫ్ ఎల్వోసీని అందజేస్తున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేస్తాం

కందుకూరు, జూన్ 16 : బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేస్తామని బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు, దాసర్లపల్లి ఎంపీటీసీ తాండ్ర ఇందిరమ్మాదేవేందర్ అన్నారు. ఎంపీ ఎన్నికల్లో పరాజయం అయినంత మాత్రాన అధైర్యపడవద్దని, గ్రామస్థాయి నుంచి నాయకులు పార్టీ కార్యకలాపాల్లో పాల్గొనాలని సూచించారు. మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి సలహాలు తీసుకొని ముందుకు వెళ్లాలని కోరారు. గెలుపు ఓటములు సహజమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి ముందుకు వెళ్లాలని కోరా రు. స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని, ఎన్నికల్లో సత్తాచాటాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలి

ఆర్కేపురం, జూన్ 16 : కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ఉన్న వారికి నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్‌రావు అన్నారు. ఆదివారం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ మధు యాష్కిగౌడ్‌ను కలిసి శ్రీనివాస్‌రావు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను 40 ఏండ్లుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ పార్టీ కష్టకాలంలో ఉన్నా.. పార్టీని వీడకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. చాలా మంది పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీని వీడి ఇతర పార్టీలోకి వెళ్లి మళ్లీ పార్టీ అధికారంలోకి రాగానే పార్టీలోకి వచ్చి నామినేటెడ్ పదవులు దక్కించుకోవాలని చూస్తున్నారన్నారు. అలాంటి వారికి పార్టీ అవకాశం ఇవ్వద్దని, సేవలను గుర్తించి అవకాశం కల్పించాలని కోరారు.

నియోజకవర్గాల రూపురేఖలు మారుస్తా

మన్సూరాబాద్ పెద్దచెరువు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మల్కాజిగిరి ఎంపీ ఈటల

హయత్‌నగర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల, చిత్రంలో హయత్‌నగర్ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

మన్సూరాబాద్, జూన్ 16 : పార్టీలు, రాజకీయాలకతీతంగా పరిపాలనను కొనసాగిస్తూ అన్ని నియోజకవర్గాల రూపురేఖలు మారుస్తానని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మన్సూరాబాద్ డివిజన్ పరిధి పెద్దచెరువు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై మార్నింగ్ వాకర్స్‌ను కలుసుకున్నారు. ఈటల మాట్లాడుతూ.. అత్యధిక మెజార్టీ ఇచ్చిన ఎల్బీనగర్ నియోజకవర్గ ప్రజలకు జవాబుదారీగా పని చేస్తానన్నారు. నాగోల్ డివిజన్ పరిధి శుభం కన్వెన్షన్ హాల్లో కార్పొరేటర్ చింతల అరుణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి హాజరయ్యారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అర్బన్ బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, ఎల్బీనగర్ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, నాయకులు కుంట్లూరు వెంకటేశ్ గౌడ్, వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నాంపల్లి రామేశ్వర్, పాతూరి శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

హయత్‌నగర్ : ప్రజలకు సేవకుడిగా పనిచేస్తానని మల్కాజిగిరి ఎంపీ ఈటల అన్నారు. ఆదివారం హయత్‌నగర్‌లోని ఎస్‌వీ కన్వెన్షన్ హాల్‌లో హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో కృతజ్ఞత సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపీ ఈటల మాట్లాడుతూ.. మల్కాజిగిరి సెగ్మెంట్‌ను అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రానికి ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, రాష్ట్ర నాయకులు కళ్లెం రవీందర్‌రెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ బండారి భాస్కర్, ఎల్బీనగర్ కన్వీనర్ కోట రవీందర్, సీనియర్ నాయకులు వెంకటేశ్ గౌడ్, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పారంద మహేశ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సంఘి అశోక్, గోవిందచారి, కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కంప్యూటర్ శిక్షణా తరగతులు ప్రారంభం

సైదాబాద్ జూన్ 16 : సైదాబాద్ కృష్ణానగర్‌లోని కారుణ్య సింధు బాలుర ఆశ్రమంలో ఆదివారం కంప్యూటర్ శిక్షణా తరగతుల కార్యక్రమ ప్రారంభోత్సవంలో ఉప్పల్ మాజీ కార్పొరేటర్ సదానంద, ఫ్యాకల్టీ కార్తీక్, కరుణశ్రీ సేవా సమితి అధ్యక్షులు సత్యమూర్తి, వెంకటేశ్వరావు, మాణిక్‌రావు, వెంకట్‌రెడ్డి, శంకర్ గౌడ్, ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్యవర్గ సమావేశం

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఆర్యవైశ్య కార్యవర్గ సభ్యుల మొదటి కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ప్రమాణ స్వీకారానికి సహకరించిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లో చేయబోయే కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, శ్రీరామచంద్రమూర్తి, ప్రేమ్‌కుమార్, ఉప్పల రవీందర్, శ్యామ్‌ప్రసాద్, శుభకుమార్, శంకర్, పబ్బారాజు, లక్ష్మణ్ ఉన్నారు.

- బడంగ్‌పేట్

ఫేక్ యాప్‌లను నమ్మరాదు

కులకచర్ల, జూన్ 16 : ఎస్బీఐ, టీజీబీల పేర్లతో ఇటీవల చాలా యాప్‌లు వస్తున్నాయని వాటిని నమ్మరాదని కులకచర్ల సోషల్ మీడియా కన్వీనర్ చాకలి వెంకటేశ్ తెలిపారు. ఎస్బీఐ, టీజీబీ బ్యాంకుల పేర్లమీద యాప్‌లు పంపి వాటిని అప్‌డేట్ చేసుకోవాలని, లింక్‌ను ఓపెన్ చేయాలని పంపిస్తున్నారని తెలిపారు. లింక్‌ను ఓపెన్ చేస్తే వారి ఖాతాల్లో డబ్బులు పోయే ప్రమాదం ఉందన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి వచ్చిన లింకులను ఓపెన్ చేయకుండా వాట్సాప్ గ్రూపు నుంచి తొలిగించాలన్నారు. దీని ద్వారా సైబర్ నేరగాళ్ల చేతిలోకి నంబర్ వెళ్లి ఉన్నడబ్బులు పూర్తి స్థాయిలో పోగొట్టుకునే ప్రమాదం ఉందని తెలిపారు. ఇటీవల చాలా లింకులు వస్తున్నాయని వాటితో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపారు.

పశువులను తరలిస్తున్న వాహనం పట్టివేత

వాహనంలో తరలిస్తున్న పశువులు

ధారూరు, జూన్ 16 : ఎలాంటి అనుమతి లేకుండా పశువులను తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ధారూరు పోలీసులు తెలిపిన వివరాలు.. ఆదివారం మండల పరిధిలోని లక్ష్మీనగర్ తండా సమీపంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఓ వాహనాన్ని తనిఖీ చేయగా ఒక ఆవు, మూడు లేగదూడలను అనుమతి లేకుండా తరలిస్తున్నారు. వాహనాన్ని స్వాధీనం చేసుకుని, డ్రైవర్ సుభాన్ ఖురేషిని వివరాలు అడుగగా బొంరాస్‌పేట మండల పరిధిలోని బురాన్‌పూర్‌కు చెందిన చిప్ప శ్రీకాంత్ వద్ద రూ.50వేలకు ధారూరుకు చెందిను అబ్దుల్ అలీం కొనుగోలు చేశారని తెలిపారు. వికారాబాద్‌లో మాంసం విక్రయదారులకు అమ్మేందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. నేరానికి పాల్పడిన, వాటిని తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వేణుగోపాల్ గౌడ్ తెలిపారు.

వివాహిత అదృశ్యం

షబానాబేగం (ఫైల్)

ధారూరు,జూన్ 16 : వివాహిత అదృశ్యమైన ఘటన ధారూరు పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. ఆదివారం పోలీసులు తెలిపిన వివరాలు... మండల పరిధిలోని మోమిన్‌కలాన్ గ్రామానికి చెందిన బంటు తారబి కూతురు షబానాబేగం (40)కు వికారాబాద్ కు చెందిన తాజుద్దీన్‌తో 13 ఏండ్ల క్రితం వివాహం జరిగింది. గత కొంత కాలంగా భార్యాభర్తల మధ్యన మనస్పర్థలు రావడంతో గత నెలలో తల్లిగారి ఊరైన మోమిన్‌కలాన్‌కు వచ్చింది. ఈ నెల 14న ఉదయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. చుట్టుపక్కల, బంధువులు, భర్త వద్దకు వెళ్లకపోవడంతో తల్లి బంటు తారబి ఫిర్యాదు మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు.

కోట్‌పల్లి మార్కెట్ కమిటీ ఎన్నిక

వికారాబాద్, జూన్ 16 : ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కోట్‌పల్లి మార్కెట్ కమిటీ ఎన్నిక జరిగింది. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గడ్డకింది అంజయ్య, వైస్ చైర్మన్‌గా నారాయణరెడ్డి, కమిటీ సభ్యులుగా భ్రమరాంబ, హరిసూధన్‌రెడ్డి, ఇక్బాల్, రామ్‌శెట్టి, చంద్రప్ప, రమేశ్, పుష్పాబాయ్, బందప్ప, శ్రీనివాస్, అక్బర్, కిరణ్‌కుమార్, శ్రీధర్ తదితరులు ఉన్నారు. ఈ కమిటీని ఉన్నతాధికారులు, మండల స్థాయి అధికారులు ఎన్నుకొన్నారు.

పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్, ఎస్ఎన్‌డీపీ ఈఈ

వరదనీటి కాల్వ పనులు పూర్తి చేయాలి

ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలో కొనసాగుతున్న పనులను ఆదివారం కార్పొరేటర్ జంగం శ్వేత, ఎస్ఎన్‌డీపీ ఈఈ రోహిణి పరిశీలించారు. సింగరేణికాలనీ, ఆదర్శనగర్‌ల్లో కొనసాగుతున్న బాక్స్‌డ్రైన్ నిర్మాణ పనుల వివరాలు తెలుసుకున్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, సకాలంలో పనులు పూర్తి చేయాలని కాం ట్రాక్టర్లకు సూచనలు చేశారు. కార్యక్రమం లో బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షులు జంగం మధుకర్ రెడ్డి, ఎస్ఎన్‌డీపీ డీఈ కనకయ్య, ఏఈ భరత్, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

- సైదాబాద్